క్లుప్తంగా

పోలీసుశాఖ స్పందన

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని ఏఆర్ పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ రిశాంత్‌రెడ్డి తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై వినతులు అందించవచ్చని, ఎలాంటి విషయమైనా నేరుగా తమకు తెలియజేయవచ్చన్నారు.

ఘనంగా ముందస్తు క్రిస్మస్ వేడుకలు



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

కార్వేటినగరం: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో వెలసి ఉన్న బేతేల్‌షారోన్ చర్చిలో పాస్టర్ ఆశీర్వాదం ఆధ్వర్యంలో ముందుస్తు క్రిస్మస్ వేడుకలను ఆదివారం ఘనంగా జపురుకున్నారు. ఈ సందర్భంగా పాస్టర్ ఆశీర్వాదం మాట్లాడుతూ డిసెంబర్ మాసంలో ఏసు జయంతి సందర్భంగా ప్రతి ఇంటిపై శిలువతో కూడిన స్టార్‌లను ఏర్పాటు చేసి ప్రభువును మహిమపరుస్తారని చెప్పారు. అనంతరం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. ఈ క్రమంలో భాగంగా క్రిస్మస్ తాత వేషంలో మార్కు మురగయ్య పలువురిని ఆకట్టుకున్నారు. అదేవిధంగా గ్రామ వీధుల్లో ప్రభువు గీతాలను ఆలపిస్తూ స్టార్లతో కూడిన పతాకాలను చేపట్టి ర్యాలీ నిర్వహించారు. అనంతరం చర్చి ఆవరణలో చిన్నారులచే కేక్ కట్ చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాస్టర్లు బాబు, హరిబాబు, పాల్(కాణిపాకం పట్టణం) విశ్వాసకులు పలువురు పాల్గొన్నారు.

12 నుంచి కొత్తపల్లిలో భగవద్గీత సప్తాహం

శ్రీరంగరాజపురం: మండలంలోని 49 కొత్తపల్లి గ్రామంలో వెలసిన భజన మందిరంలో ఈ నెల 12వ తేదీ నుంచి 18వ తేదీ వరకు భగవద్గీత సప్తాహం కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు నాగరాజుపిళ్ళై వెంకటాద్రినాయుడు, సూరిరెడ్డి, సుధాకర్‌పిళ్ళై ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీశ్రీశ్రీ చిన్మయానందస్వామీజీ, శ్రీశ్రీశ్రీ శారదప్రియానంద అమ్మవారి ఆశీస్సులతో వారి శిష్యురాలు శ్రీశ్రీ శ్రేయానంద సరస్వతి 49 కొత్తపల్లి గ్రామానికి విచ్చేస్తారన్నారు. గ్రామంలోని భజన మందిరంలో ప్రతి రోజు ఉదయం 7 నుంచి 8.30 గంటల వరకు భగవద్గీత మూడవ అధ్యాయం, కర్మయోగంపై వారం రోజుల పాటు భగవద్గీత సప్తాహం నిర్వహిస్తారని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

అయ్యప్ప స్వామికి పూజలు



ప్రత్యేక అలంకరణలో పడిమెట్లు

నింద్ర: మండల కేంద్రమైన నింద్రలో ఆదివారం అయ్యప్పస్వామి భక్తులు ఇరుముడి కట్టుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గత మూడు వారాలుగా గ్రామంలో అయ్యప్ప మాలధారులు ప్రతిరోజు పూజలు చేపట్టారు. ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించి, ఇరుముడి కట్టుకుని అయ్యప్ప స్వామి దర్శనానికి శబరిమలైకు వెళ్లారు.

మామిడి తోటపై ఏనుగుల దాడి



ఏనుగులు ధ్వంసం చేసిన డ్రిప్ పైపులు

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని పాళెం పంచాయతీ పరిసర ప్రాంతాల్లో ఆదివారం తెల్లవారు జామున మామిడి తోటలపై ఏనుగులు దాడి చేశాయి. మునస్వామికి చెందిన లేత మామిడి చెట్లతోపాటు కొత్తగా ఏర్పాటు చేసిన డ్రిప్ పైపులను కూడా ధ్వంసం చేశాయి. రెండు రోజులుగా పాళెం పరిసర ప్రాంతాల్లోనే ఏనుగులు సంచరిస్తుండడంతో చుట్టుపక్కల గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

నిత్యాన్నదానానికి విరాళం



విరాళం ఇస్తున్న దాత కుటుంబ సభ్యులు

కాణిపాకం(యాదమరి): హైదరాబాద్‌కు చెందిన అజయ్‌కుమార్ ఆదివారం కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం అందజేశారు. అధికారులు దాత కుటుంబ సభ్యులకు స్వామివారి దర్శనం కలిపించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్ర కిట్లు



స్కూల్ గేమ్స్ కిట్‌లో ఉన్న క్రీడాసామగ్రి



క్రీడా జాతర.. ఆడుదాం ఆంధ్ర

విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్న ప్రభుత్వం క్రీడలకు కూడా అంతే ప్రాధాన్యత ఇస్తోంది. దీంతో వరుస టోర్నమెంట్లతో మైదానాలు క్రీడాకారులతో కళకళలాడుతున్నాయి. పోటీల నిర్వహణతో పాటు క్రీడాకారులకు అవసరమైన క్రీడాసామగ్రిని కూడా ప్రభుత్వం పుష్కలంగా అందిస్తోంది. ప్రతి సచివాలయానికి ఆడుదాం ఆంధ్ర క్రీడా సామగ్రి చేరుకుంటుండగా పాఠశాలలకు స్కూల్ గేమ్స్‌కు అందించిన క్రీడాసామగ్రి చేరుతోంది. దీంతో క్రీడలకు, క్రీడాకారులకు ప్రస్తుతం సువర్ణ కాలం నడుస్తోంది.

- క్రీడాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట
- తీరిన క్రీడాసామగ్రి కొరత
- ఆడుదాం ఆంధ్ర, స్కూల్ గేమ్స్‌కు సిద్ధం

నగరి : యువతలో క్రీడా స్ఫూర్తిని నింపేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ నెల 15 నుంచి ఫిబ్రవరి మూడో తేదీ వరకు ఆడుదాం.. ఆంధ్ర క్రీడా పోటీలను నిర్వహించేందుకు సమాయత్తమవుతున్న విషయం తెలిసిందే. సచివాలయ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ఈ పోటీలు జరుగుతాయి. దీనిలో భాగంగానే సచివాలయ స్థాయిలో ఆడే క్రీడాకారుల కోసం బేసిక్, ప్రొఫెషనల్ క్రీడాసామగ్రి పంపిణీ చురుగ్గా సాగుతోంది. గ్రామ, వార్డు సచివాలయ స్థాయి నుంచి ఐదు దశల్లో పోటీలను నిర్వహించనున్నారు. ప్రతి దశలోనూ క్రీడాకారుల ప్రతిభను వెలికితీయడంతో పాటుగా విజేతలను సర్టిఫికెట్స్, మెమెంటోలు, నగదు పురస్కారాలతో సత్కరించనుంది. 15 ఏళ్లు పైబడిన బాలబాలికలు అందరినీ పోటీల్లో భాగస్వాములను చేసేలా 'ఓపెన్ మీట్' పోటీలు కూడా జరగనున్నాయి. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు క్రికెట్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్ డబుల్స్‌లో విజేతలకు నగదు బహుమతులు ఇవ్వనున్నారు. దీంతో ఆడుదాం.. ఆంధ్రా క్రీడల్లో పాల్గొనేందుకు యువత ఎంతో ఉత్సాహం చూపుతున్నారు.



తెరణి సచివాలయంలో ఆడుదాం ఆంధ్ర కిట్



ఎమ్మార్సీకి చేరిన స్కూల్ గేమ్స్ కిట్లు

సచివాలయాలకు చేరుతున్న క్రీడాసామగ్రి..

ఆడుదాం ఆంధ్ర క్రీడలు స్టేజ్–1లో భాగంగా ఒక్కో సచివాలయానికి ఒక క్రీడాకిట్ చొప్పున నియోజకవర్గానికి 90 కిట్లు అందించనున్నారు. ఒక్కోకిట్‌లో బాలురకు రెండు బేసిక్ క్రికెట్ కిట్లు, బాలికలకు ఒక బేసిక్ క్రికెట్ కిట్టు, మూడు వాలీబాల్స్, ఒక వాలీబాల్ నెట్, ఆరు షటిల్ రాకెట్లు, 3 నైలాన్ షటిల్ కాక్స్, ఒక షటిల్ నెట్, రెండు టెన్నికాయిట్ రింగ్స్, స్టేజ్–2లో భాగంగా ఒక్కో మండలానికి మూడు ప్రొఫెషనల్ క్రికెట్ కిట్లు, ఎనిమిది ప్రొఫెషనల్ బ్యాడ్మింటన్ రాకెట్లు, పది బ్యారల్స్ షటిల్ కాక్స్, నాలుగు వాలీబాల్స్, 25 కబడ్డీ నీ క్యాప్స్, 25 ప్రొఫెషనల్ ఖోఖో యానిట్లను ప్రభుత్వం మంజూరు కేటాయించింది. ఆయా మండలాల ఎంపీడీఓలు, సచివాలయాలకు అందిస్తున్నారు.

నియోజకవర్గంలో సచివాలయాలు	90
ప్రాథమిక పాఠశాలలు	236
ప్రాథమికోన్నత పాఠశాలలు	28
ఉన్నత పాఠశాలలు	40

స్కూళ్లకు క్రీడాసామగ్రి..

సర్వశిక్ష అభియాన్ ద్వారా ప్రతి పాఠశాలకు క్రీడా సామగ్రి అందనుంది. ఇప్పటికే ఎమ్మార్సీ కేంద్రానికి చేరుకున్న సామగ్రిని ఆయా పాఠశాలలకు పంపిణీ చేయనున్నారు. ఇందులో భాగంగా ప్రతి ఉన్నత పాఠశాలకు 17 రకాల క్రీడలకు సంబంధించిన సామగ్రి (వాలీబాల్–3, వాలీబాల్‌నెట్–1, త్రోబాల్–2, త్రోబాల్ నెట్–1, హ్యాండ్‌బాల్–2, టెన్నికాయిట్–6, టెన్నికాయిట్ నెట్–1, స్కిప్పింగ్ రోప్స్–5, యోగామేట్–3, చెస్‌సెట్–4, ఫుట్ ఏర్ పంప్–1, ఫుట్‌బాల్–2, వెయింగ్ మిషన్–1, షాట్ ఫుట్ 4 కేజీలు– 1, 3 కేజీలు–1, డిస్కస్‌త్రో 2కేజీలు–1, మెజరింగ్ టేప్–1) ఉంటాయి. ప్రతి ప్రాథమికోన్నత పాఠశాలకు 14 రకాల క్రీడా సామగ్రి (వాలీబాల్–1, త్రోబాల్–1, టెన్నికాయిట్–4, టెన్నికాయిట్ నెట్–1, చెస్‌సెట్–4, హ్యాండ్ బాల్–1, స్కిప్పింగ్ రోప్స్–5, వేయింగ్ మిషన్–1, షాట్ ఫుట్ 4కేజీలు–1, డిస్కస్‌త్రో 1 కేజీ–1, కోన్స్–12, 6 స్టెప్పుల హర్డిల్ – 6, ఫ్రిస్బీ 9 ఇంచులవి–2, 12 ఇంచుది–1) ప్రతి ప్రాథమిక పాఠశాలకు 9 రకాల క్రీడాసామగ్రి (వాలీబాల్–1, ఫైబర్ క్రికెట్–1, సాఫ్ట్ టెన్నిస్‌బాల్–8, వాలీబాల్–1, హ్యాండ్‌బాల్–1, ఫ్రిస్బీ 9 ఇంచులవి–2, 12 ఇంచుది–1, మల్టీకలర్ హులాహూప్స్–2, 6 స్టెప్పుల హర్డిల్ – 6, స్కిప్పింగ్ రోప్–3) అందనుంది. ఈ క్రీడా సామగ్రి నియోజకవర్గంలోని 32,468 మంది విద్యార్థులకు ఉపయోగపడనుంది.

క్రీడాసామగ్రిని సద్వినియోగం చేసుకోవాలి..



సచివాలయాలకు చేరుతున్న ఆడుదాం ఆంధ్ర క్రీడాసామగ్రిని, పాఠశాలలకు చేరుతున్న క్రీడాసామగ్రిని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలి. పలు రకాల క్రీడలకు సంబంధిత సామగ్రి అందుబాటులో ఉంది కనుక వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థి ఏ క్రీడలో నైపుణ్యం ప్రదర్శించగలడో పరిశీలించి అందులో అతనికి తర్ఫీదు అందించడానికి సహకరిస్తుంది.

– సురేష్‌బాబు, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి, నగరి

వరసిద్ధుడి సేవలో దాతలు

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయ పునఃనిర్మాణానికి విరాళాలు ఇచ్చిన ఎస్‌ఆర్‌ఐలు ఐకా రవి, గుత్తికొండ శ్రీనివాస్, గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్ ఆదివారం స్వామిని దర్శించుకున్నారు. వారికి ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈవో వెంకటేశు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం దాతలు స్వామివారి గర్భాలయం, అంత్రాలయం, ద్వారాలకు బంగారు తాపడం, వెండి తాపడం పనులు చేపట్టారు. ఆ పనులు పూర్తి కావస్తుండడంతో త్వరలో ప్రధాన తూర్పు ద్వారానికి వెండి తాపడం కోసం పరిశీలించారు. దాతలకు ఆలయ అధికారులు ఆశీర్వాద మండపంలో వేదపండితులచే ఆశీర్వచనం చేయించి స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో విద్యాసాగర్ రెడ్డి, సూపరింటెండెంట్ కోదండపాణి, వాసు, ఇంజినీరింగ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వినాయకునికి శాస్త్రోక్తంగా అభిషేకాలు



స్వామివారికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామికి కార్తీక మాసం సందర్భంగా ఆదివారం శాస్త్రోక్తంగా అభిషేకాలు చేశారు. ఉదయం స్వామివారి కల్యాణ వేదికలో సిద్ధి, బుద్ధి, సమేత వినాయక స్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొచ్చి కొలువుతీర్చారు. అనంతరం ఆలయ అర్చకులు, వేదపండితులు శాస్త్రోక్తంగా ప్రత్యేక అభిషేకాలు, హోమం చేశారు. తదుపరి కల్యాణోత్సవం చేశారు. ఈ కార్యక్రమాలకు ఉభయదారులుగా టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు పోకల అశోక్‌కుమార్ వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈవో వెంకటేశు, ఏఈవో విద్యాసాగర్ రెడ్డి, సూపరింటెండెంట్ కోదండపాణి తదితరులు పాల్గొన్నారు.

సీమ సమగ్రాభివృద్ధికి ఉద్యమం



మాట్లాడుతున్న జనచైతన్య వేదిక అధ్యక్షుడు లక్ష్మణరెడ్డి

తిరుపతి కల్చరల్: రాయలసీమ సమగ్రాభివృద్ధికి ఐక్యంగా ఉద్యమించాలని వివిధ రాజకీయ పార్టీల నేతలు పిలుపు నిచ్చారు. జనచైతన్య వేదిక ఆంధ్రప్రదేశ్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం తిరుపతి యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ×రాయలసీమ అభివృద్ధి– సమస్యలు×పై చర్చా గోష్ఠి నిర్వహించారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి రాజ్యసభ మాజీ సభ్యుడు ఎస్. తులసిరెడ్డి మాట్లాడారు. విభజన హామీలను కేంద్రం అమలు చేయకపోవడంతో రాయలసీమ తీవ్రంగా నష్టపోయిందన్నారు. సీపీఐ కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా సీమ అభివృద్ధికి నడుంబిగించాలని సూచించారు. లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ నీటి పారుదల ప్రాజెక్టులను పట్టించుకోకపోవడం వల్లే సీమ కరువు ప్రాంతంగా మారిందన్నారు. జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్ మాట్లాడుతూ రాయలసీమకు నీరు, నిధులు, నియామకాల్లో న్యాయం జరగాలని కోరారు. సీపీఐ నేత జి.ఓబులేష్ మాట్లాడుతూ సీమ అభివృద్ధికి చేపట్టే చర్యలను అన్ని పార్టీలు తమ ప్రణాళికలో పేర్కొనాలని స్పష్టం చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టీడీపీ నేత నరసింహ యాదవ్, సీపీఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు, సీపీఐ నేతలు రాధాకృష్ణ, పెంచలయ్య, కాంగ్రెస్ నేత నవీన్‌కుమార్‌రెడ్డి ప్రసంగించారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



శ్రీవారి ఆలయం వెలుపల జస్టిస్ ఎన్వీ బద్రీనాథ్



మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్

తిరుమల: తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరిలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ బద్రీనాథ్, మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్, మాజీ ఐఏఎస్ అధికారులు నిమ్మగడ్డ రమేష్ కుమార్, ఎల్వీ సుబ్రహ్మణ్యం, తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజ్ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

23, 24న 'ఆడుదాం బెంగళూర్'



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

- కరపత్రాలు ఆవిష్కరించిన జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: కర్ణాటక రాష్ట్ర రాజధాని బెంగళూరులో ఐటీ, వివిధ రంగాల్లో పనిచేస్తున్న వారు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగనన్న అభిమానులు 'ఆడుదాం బెంగళూర్' పేరిట పలు క్రీడలను నిర్వహించనున్నట్టు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. దీనికి సంబంధించి ఆదివారం ఆయన ఆడుదాం బెంగుళూర్ కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. సీఎం జగనన్న అభిమానులు భారీ ఎత్తున ఈ పోటీలు నిర్వహించనుండటం అభినందనీయమన్నారు. బెంగళూరు పారిశ్రామికాభివృద్ధిలో అక్కడ ఉంటున్న మన రాష్ట్ర ప్రజల పాత్ర కూడా ఎంతో ఉందన్నారు. ప్రజల మధ్య ఐక్యతకు ఈ పోటీలు దోహదం చేస్తామన్నారు. ఈ నెల 23, 24వ తేదీల్లో బెంగళూర్ వేదికగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఐటీ విభాగం యువత, మండల వాసులు పాల్గొన్నారు.

పెరిగిన భూగర్భ జలమట్టం

బుచ్చినాయుడుకండ్రిగ: తుపాన్ వర్షాలకు మండలంలోని కాళంగి నది ఉధృత ప్రవాహం కొనసాగుతూనే ఉంది. నదికి ఆనుకుని కాటూరు, పల్లమాల, చిన్నయిగుంట, అరిగిలకండ్రిగ, జంబుగోళం గ్రామాల రైతులకు చెందిన పొలాలున్నాయి. వ్యవసాయ బోర్లలో నీటి మట్టం పెరిగిందని, సాగునీటికి ఢోకా లేదని రైతులు చెబుతున్నారు. అలాగే చెరువులకు కాలువల ద్వారా నీరు భారీగా చేరుతుంది. తలారివెట్టు, కల్లివెట్టు గ్రామాల మధ్య ఉన్న ఏడుగండ్లు వారధి కూడా ఉధృతంగా ప్రవహిస్తుంది. పంట పొలాల కోసం కాళంగినది ఒడ్డున ఏర్పాటు చేసిన బోరు మోటార్లు వరదనీటి ప్రవాహంతో దెబ్బతింటున్నాయి.

వైభవంగా తిరు వాసగం ఊరేగింపు

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లిలో శ్రీపల్లికొండేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం తిరువాసగం ఉత్సవం వైభవంగా జరిగింది. ఉదయం 10 గంటలకు చెన్నై అడయార్‌కి చెందిన 200 మంది శివ భక్తులతో ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి యోగ తిరువాచకం పీఠాన్ని శిరస్సుపై ఉంచుకుని ఊత్తుకోట్టై శ్రీనీలకంఠేశ్వరస్వామి ఆలయం నుంచి మేళతాళాలు, శివ నామ స్మరణల నడుమ భక్తులతో కలిసి శ్రీపల్లికొండేశ్వరస్వామి ఆలయానికి చేరుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ పాలక మండలి సభ్యుడు జి.మునివేలు పాల్గొన్నారు.

భవహరణా.. శుభచరణా



కార్తీక దీపాన్ని ఆవిష్కరిస్తున్న చైర్మన్ శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: ఓం నమఃశ్శివాయ నామస్మరణతో శ్రీకాళహస్తీశ్వరాలయం ప్రతిధ్వనించింది. శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం ఆకాదీపాన్ని శాస్త్రోక్తంగా వెలిగించారు. ప్రముఖ శైవక్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ప్రతిరోజూ ఆకాశదీపాన్ని సంప్రదాయబద్ధంగా వెలిగిస్తున్నారు. ఆదివారం రాత్రి ఆలయంలోని ఊంజల్‌సేవ మండపం వద్ద ఏర్పాటు చేసిన కార్తీక దీపానికి పూజలు చేశారు. అనంతరం స్తూపానికి జ్యోతిని అమర్చి ఆకాశదీపంగా ఎగురవేశారు. భక్తులు ఓం నమశ్శివాయ అంటూ ఆకాశదీపాన్ని దర్శించుకున్నారు. పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందిస్తున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి

నగరి: ఆత్మీయులను కోల్పోయిన వారి కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా సోదరుడు వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి భరోసా ఇచ్చారు. నగరి మున్సిపాలిటీ 9వ వార్డు సత్తం దళితవాడకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త బ్రహ్మయ్య ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబానికి రోజా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.10 వేలు ఆర్థికసాయం అందించారు. ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం అందేలా చూస్తామని తెలిపారు. అప్పులను కోల్పోయినా మనోధైర్యంతో ముందుకెళ్లాలని, పార్టీ అన్నివేళలా అండగా ఉంటుందని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

ఎంపీడీఓ మృతదేహానికి నివాళులు



శ్రీనివాసన్ మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి

చిత్తూరు కార్పొరేషన్ : సెలవులో ఉంటూ ఆకస్మికంగా మృతి చెందిన గుడుపల్లి ఎంపీడీఓ శ్రీనివాసన్ మృతదేహానికి జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి నివాళులు అర్పించారు. ఆదివారం నగరంలోని కొంగారెడ్డిపల్లి ఎంపీడీఓ నివాసానికి వెళ్లారు. అక్కడ శ్రీనివాసన్ మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఎంపీడీఓ కుటుంబ సభ్యులకు జెడ్పీ సీఈఓ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో జెడ్పీ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

17న విశ్రాంత ఉద్యోగుల దినోత్సవం

పుంగనూరు: విశ్రాంత ఉద్యోగుల దినోత్సవాన్ని ఈనెల 17న ఘనంగా నిర్వహించనున్నామని సంఘ అధ్యక్షుడు చెంగారెడ్డి తెలిపారు. ఆదివారం మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలసి సమావేశానికి ఆహ్వానించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు చంద్రశేఖర్, రామకృష్ణారెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కుల పరిరక్షణతో సమాజ శ్రేయస్సు

- జ్యుడీషియల్ జడ్జి పసుపులేటి శంకర్



మాట్లాడుతున్న రాజంపేట జ్యుడిషియల్ జడ్జి పసుపులేటి శంకర్

తిరుపతి కల్చరల్: మానవ హక్కుల పరిరక్షణ సమాజ శ్రేయస్సుకు దోహదమని, ప్రతి ఒక్కరూ మానవ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని రాజంపేట జ్యుడిషియల్ జడ్జి పసుపులేటి శంకర్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా వరల్డ్ హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ సుధామయి ఆధ్వర్యంలో ఆదివారం తిరుపతి రైల్వే కాలనీలోని సరస్వతీ శిశుమందిరంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య వక్తగా ప్రసంగించారు. రాజ్యాంగం ద్వారా మానవ హక్కులను కల్పించి హ్యూమన్ రైట్స్ కమిషన్ ఏర్పాటు చేసుకున్న దేశం మన భారతదేశమని తెలిపారు. నేడు హక్కుల ద్వారా ప్రశ్నించే స్థాయి పెరిగిందన్నారు. స్త్రీమూర్తులు సైతం దేశ స్వేచ్ఛ సాధనలో కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. దేశం, కుటుంబ వ్యవస్థ సుభిక్షతలో మహిళల పాత్ర కీలక మని తెలిపారు. భారత దేశం మనకు అందించిన సంస్కృతి, సనాతన ధర్మాలను కుటుంబంలో పిల్లలకు అందించడంతో పాటు మానవ హక్కులపై వారిని చైతన్యం కలిగించి మంచి పౌరులుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో అసమానతలను విడనాడి సమానత్వం అనే భావన రేకెత్తించడంతో పాటు హక్కుల సాధన పరమావధిగా ముందుకు సాగాలని తెలిపారు. అనంతరం రుయా డాక్టర్ రోజారమణి, సరస్వతి శిశుమందిర్ అధ్యక్షుడు ప్రొఫెసర్ హేమంత్‌కుమార్, సరస్వతి శిశుమందిరం స్కూల్ కమిటీ ప్రతినిధి కీర్తి వెంకయ్య మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన మానవ హక్కులు, వాటి వినియోగం, ప్రయోజనాల గురించి వివరించారు. కార్యక్రమంలో వరల్డ్ హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ నేతలు, సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.